క్లుప్తంగా

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా



హ్యాండ్‌బాల్ పోటీలో తలపడుతున్న ఇరు జట్ల క్రీడాకారులు

కర్నూలు (టౌన్): క్రీడాకారులకు తన వంతు ప్రోత్సాహం అందిస్తానని కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ సీనియర్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. 9 జిల్లాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యా సంస్థల వ్యవస్థాపకులు తిమ్మయ్య, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

11న వైఎస్సార్ చేయూత సంబరాలు

కర్నూలు సిటీ: మండల పరిధిలోని పసుపుల సచివాలయం సమీపంలోని ఫంక్షన్ హాలులో ఈనెల 11న వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహించనున్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల లబ్ధిదారులతో పాటు వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి హాజరుకానున్నారు.

వేలం పాటలు

కర్నూలు సిటీ: ఏపీఎస్‌ఆర్టీసీ కర్నూలు బస్ స్టేషన్‌లోని కార్గో లాజిస్టిక్స్ కౌంటర్‌లో క్లెయిమ్ చేయని వస్తువులను సోమవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నారు. ఈ వేలం పాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని జిల్లా ప్రజారవాణా అధికారులు తెలిపారు.

జంబో షెడ్డు ప్రారంభం

కర్నూలు (అగ్రికల్చర్): వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో చేపట్టిన జంబో షెడ్డును ఈనెల 11న పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించనున్నారని మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తెలిపారు.


'కామినేని'లో లైవ్ ఆర్థోస్కోపీ సర్జరీ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో మొదటిసారిగా లైవ్ ఆర్థోస్కోపీ సర్జరీ నిర్వహించారు. స్మిత్ నెప్యూ కంపెనీ సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఎస్వీ చంద్రశేఖర్, డాక్టర్ జీవీఎస్ రవిబాబు, స్మిత్ నెప్యూ అకాడమీ మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ ఆర్థోస్కోపీ వైద్యులు ప్రథమేష్ జైన్, చిరగ్ తోంసే, ప్రదీప్‌కుమార్‌చే మోకాళ్ల సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ముగ్గురు రోగులకు ఉచితంగా ఖరీదైన ఆర్థోస్కోపీ సర్జరీ చేశామన్నారు. దానికి అనుగుణంగా యువ ఆర్థోస్కోపీ వైద్యులకు అవగాహన కోసం లైవ్ స్క్రీన్‌లో ప్రదర్శించి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఈఓ డాక్టర్ గణేష్, మార్కెటింగ్ డీజీఎం రమాబాబు, మార్కెటింగ్ జీఎం షేక్షావలి, హాస్పిటల్ ఆపరేషన్ హెడ్ నదీం పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలి



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

కర్నూలు(సెంట్రల్): దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలని దళిత సోషన్ ముక్తి మంచ్(డీఎస్ఎంఎం) జాతీయ నాయకులు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు ఎంపీపీ హాలులో మత స్వేచ్ఛ..మత సామరస్యం అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో ఎవరికి నచ్చిన మతం, కులాన్ని వారు ఎంచుకోవచ్చని, అదే సమయంలో సామాజిక, ఆర్థిక అంశాల ఆధారంగా రిజర్వేషన్లను రాజ్యాంగం హక్కుగా కల్పిస్తోందని చెప్పారు. క్రిష్టియన్‌లుగా మారిన దళితులకు ఎస్సీ రిజర్వేషన్‌ను కొనసాగించాలని, బీసీలుగా గుర్తించడం అన్యాయమని అన్నారు. దళిత క్రిష్టియన్‌లను ఎస్సీలు కొనసాగించాలని ఏపీ ప్రభుత్వం తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపగా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీని ఇంటికి పంపకపోతే దళితులను బానిసలు గామార్చే ప్రమాదం ఉందన్నారు. సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, ఎండీ ఆనందబాబు తదితరులు మాట్లాడారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

- జిల్లాలోని 2,186 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన
- 8 నియోజకవర్గాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల గుర్తింపు
- ఆర్‌యూలో రిసెప్షన్, స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు

సాధారణ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది. ఇప్పటికే అవసరమైన పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి వాటిలో మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేశారు. ఎన్నికల నోటిఫికేషన ఎప్పుడు వచ్చిరా పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉంది.

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో కర్నూలు పార్లమెంట్‌తోపాటు కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 20,08,721 మంది ఓటర్లు ఉన్నారు. వారందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు సిద్ధం చేసింది. 2,186 పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిలో మౌలిక సదుపాయాలను కల్పించింది. అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్లలోనే ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో వికలాంగులు, అనారోగ్యంతో బాధపడే వారు సులభంగా వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేసింది. ప్రతి పోలింగ్ కేంద్రానికి రన్నింగ్ వాటర్‌తో పాటు మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు ఏర్పాటు చేయడానికి వీలు లేని పాఠశాలల్లో మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

జీపీఎస్‌తో అనుసంధానం

ఎన్నికల నిర్వహణ కోసం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలతోపాటు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తారు. ఇందులో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకొని ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్తారు. ఇందుకోసం అన్ని నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను గుర్తించారు. కర్నూలు అసెంబ్లీకి సంబంధించి అవుట్‌డోర్ స్టేడియం, కోడుమూరుకు సంబంధించి సిల్వర్ జూబ్లీ కాలేజీ, పాణ్యంకు సంబంధించి జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, ఎమ్మిగనూరుకు సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మంత్రాలయానికి సంబంధించి పరిమళ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో, ఆదోనికి సంబంధించి ఆర్ట్స్ అండ సైన్స్ కాలేజీ, ఆలూరుకు సంబంధించి ఆలూరు జూనియర్ కాలేజీ, పత్తికొండకు సంబంధించి పత్తికొండ జూనియర్ కాలేజీలోలలో డిస్పాచ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. అందులో భాగంగా ఇప్పటికే ఆయాకేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఎన్నికలు ముగిసిన తరువాత ఎన్నికల కోసం వినియోగించిన ఈవీఎంలను నేరుగా రిసెప్షన్ సెంటర్లకు అత్యంత బందోబస్తు మధ్య తీసుకెళ్లి రిసెప్షన్ సెంటర్లలో అప్పగించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఈవీఎంలు, వీవీప్యాట్లలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్ర పరుస్తారు. ఈ క్రమంలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించి రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్‌లను రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేశారు. అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను రాయలసీమ యూనివర్సిటీలోనే ఏర్పాటు చేశారు.

నోడల్ అధికారుల నియామకం పూర్తి

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన సమన్వయం చేసేందుకు జిల్లా ఎన్నికల సంఘం నోడల్ అధికారులను నియమించింది. జిల్లా ఉన్నతాధికారులకు పని విభజన చేస్తూ దాదాపు 18 కమిటీలను నియమించారు. ఒక్కో కమిటీకి జిల్లా ఉన్నతాధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. వీరి నేతృత్వంలో అధికారులు ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటారు.



జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ (ఫైల్)



ఎస్జీబీసీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రానికి ర్యాంపు ఏర్పాటు చేసిన దృశ్యం

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఒకవైపు ఓటరు జాబితా సవరణపై దృష్టి సారిస్తూనే మరోవైపు ఏర్పాట్లు చేశాం. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసకున్నాం. కౌంటింగ్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లను రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేశాం. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులను సమన్వయం చేసేందుకు నోడల్ అధికారులను నియమించాం. త్వరలోనే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తయింది.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, కర్నూలు

నేడు చండీహోమం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. నవగ్రహ, లక్ష్మీగణపతి, మూల మంత్ర సహిత చండీహోమం, కార్యసిద్ధి ఆంజనేయస్వామికి సింధూరార్చన జరుగుతాయన్నారు.

సెలవుదినాల్లో గణనీయంగా పన్ను వసూలు

కర్నూలు (టౌన్): సెలవుదినాల్లో పన్ను కౌంటర్లు పని చేయడంతో పన్నుదారులు పన్ను చెల్లించేందుకు క్యూ కడుతున్నారు. రెండవ శనివారం ఇంటి పన్నులు, నీటి పన్నుల బకాయిలు గణనీయంగా చెల్లించారు. ఒక్క రోజు ఇంటి, నీటి పన్నులు రూ.12,82,881 వసూలైనట్లు నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ అధికారి జునీద్ తెలిపారు. ఆదివారం కూడా పన్ను కౌంటర్లు పనిచేస్తాయని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రజానగర్‌లో హోమియో వైద్యశిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు (హాస్పిటల్): నగర శివారులోని ప్రజానగర్ కాలనీలో శనివారం లైఫ్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వడదెబ్బ నివారణకు, వ్యాధి నిరోధక శక్తికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రాధిక, జాన్ డేవిడ్ మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్‌కు హోమియో మందులు బాగా పనిచేస్తాయన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు

గడివేముల: మండలంలోని భోగేశ్వరాలయం పరిధిలో రాష్ట్రస్థాయి నాలుగు పళ్లలోపు బండలాగు పో టీలు శనివారం శాంతిరాం కళాశాలల అధినేత మిద్దె శివరాం ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ రైతులు బాగుంటేనే దేశం బాగుటుందని రైతులందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఏడాది శివరాత్రికి ఎద్దుల పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. అంతకుముందు భోగేశ్వరాలయానికి వచ్చిన ఆయనకు చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డిలు స్వాగతం పలికారు.స్వామి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం మండపంలో స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

విజేత బిల్లలాపురం వృషభాలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా సాగిన పోటీల్లో బిల్లలాపురంకు చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి ఎద్దులు మొదటిస్థానంలో నిలిచి రూ. 30 వేలను కైవసం చేసుకున్నాయి. నంద్యాల మండలం పోలూరుకు చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు రెండో స్థానంలో రూ.20 వేలు, నందికొట్కూ రు మండలం కొణిదేల గ్రామానికి చెందిన దండు రైడర్స్ మూడో బహుమతి రూ.15 వేలు సాధించాయి. ఎడ్ల యజమానులకు ఆలయ చైర్మన్ సునీల్ కుమార్‌రెడ్డి, మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, ధర్మక ర్త సురేంద్రనాథ్‌రెడ్డి బహుమతులను అందించారు.

నేడు అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్ష

సి.బెళగల్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఐదో తరగతి ప్రవేశానికి ఉదయం 9 గంటలకు, ఇంటర్ ప్రవేశానికి మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌పీతో గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

గడ్డివామి దగ్ధం

కల్లూరు: మండల పరిధిలోని దొడ్డిపాడు గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న మిన్నేల్ల కళ్లంలో వేరుశనగ పొట్టు, జొన్న సోప్ప, వరి గడ్డితో గడ్డివామి వేశాడు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని వామి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అగ్నిమాపక సిబ్బంది హుటా హుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ఉపయోగించుకోవాలి



చిన్నారికి టీకా వేస్తున్న వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

కర్నూలు (హాస్పిటల్): గ్రామాల్లోకి వచ్చే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం ఆయన గార్గేయపురం సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు వచ్చే ఆరోగ్య సమస్యలను నయం చేసేందుకు గాను ప్రజల వద్దకే వైద్యసిబ్బందిని తీసుకుని వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. వైద్యుల చికిత్సతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ తదితర సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. గర్భిణులకు, చిన్నారులకు తప్పనిసరిగా సమయానుసారంగా టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు ఐరన్ ఫోలిక్ సిరప్, ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లలకు విటమిన్–ఎ సిరప్‌లు, ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేశారు.

చూసిన కనులదే భాగ్యం..

- రమణీయం..రూపాల సగమేశ్వరుని రథోత్సవం
- శివనామ స్మరణతో మారుమోగిన జగన్నాథ గట్టు

కర్నూలు కల్చరల్: ఉమా సమేత రూపాల సంగమేశ్వరుని రథోత్సవం వైభవంగా జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా కర్నూలు జగన్నాథ గట్టుపై వెలసిన శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో స్వామివారి ఉత్సవ మూర్తులకు శనివారం రథోత్సవం నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలి వచ్చి రథోత్సవంలో పాల్గొని తరించారు. హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శివ నామ స్మరణతో జగన్నాథ గట్టు మారుమోగింది. అంతకు ముందు ఉత్సవ మూర్తులను దేవాలయం నుంచి రథం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. దిన్నెదేవరపాడు గ్రామస్తులు కుంభంతో ఊరేగింపుగా వచ్చి రథానికి నైవేద్యం సమర్పించారు. ఫెస్టివల్ ఆఫీసర్ గుర్రెడ్డి, ఆలయం ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, రూపాల సంగమేశ్వర జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి అధ్యక్షులు ప్యాలకుర్తి నరసింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వా కార్యదర్శులు క్రిష్టన్న, మల్లికార్జున రెడ్డి, కోశాధికారి వాసుదేవయ్య, సభ్యులు డాక్టర్ మోక్షేశ్వరుడు, మురళి, దామోదర్‌రెడ్డి, కట్టమంచి జనార్ధన్‌రెడ్డి, పెరుగు పురుషోత్తంరెడ్డి, మహాబలేష్, తాలుకా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీధర్, దిన్నెదేవరపాడు గ్రామపెద్దలు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





కుంభం తీసుకొస్తున్న దిన్నెదేవరపాడు గ్రామస్తులు,రథోత్సవంలో పాల్గొని, రథాన్ని లాగుతున్న భక్తులు



లలితా పీఠంలో కల్యాణ మూర్తులుగా శివపార్వతులు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు



రూపాల సంగమేశ్వరునికి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

మహా శివరాత్రి ఉత్సవాలు రెండో రోజు శనివారం ఘనంగా జరిగాయి. శివపార్వతుల కల్యాణం, పల్లకీ సేవలు, రథోత్సవాలు, గ్రామోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఆది దంపతులు శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మూర్తులకు ప్రాకార పల్లకీ సేవ జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఆలయం ఈఓ ప్రసన్నలక్ష్మి, జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వాసుదేవయ్య, ఉపాధ్యక్షులు కె.క్రిష్టన్న సభ్యులు పాల్గొన్నారు.

- సంకల్ బాగ్‌లోని హరిహరక్షేత్రంలో భవానీ రామలింగేశ్వర స్వామివారికి విశేషంగా అన్నాభిషేకం నిర్వహించారు. ప్రవచన కర్త కల్లే వేణుగోపాల్ శర్మ సందేశమిచ్చారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధర్యంలో జరిగిన వేడుకల్లో సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర కోశాధికారి హెచ్.కె. మనోహరరావు, కమిటీ సభ్యులు ప్రభాకర్, శివరామ్‌ప్రసాద్, రామ మనోహర్, సోమనాథ్ మూర్తి, ఓరుగంటి విజయ్‌కుమార్, ఆలయ అర్చకులు ప్రసన్నస్వామి, గురుస్వామి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

- స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.
- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శ్రీలలితా సుందరేశ్వర స్వామి వార్ల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు.





అలరించిన నృత్య ప్రదర్శనలు